సుజనరంజని జూలై 2007 సర్వజిత్ : నిజ జ్యేష్ఠం సిలికానాంధ్ర

# సిలికానాంధ్ర కుటుంబము

పి.డి.ఎఫ్. పత్రం (PDF Doc)





## అమెరికాలో పిల్లలకు తెలుగు పద్య నాటక శిక్షణా శిబిరం

'కావ్యేషు నాటకం రమ్యం' అన్నాడు మహాకవి కాళిదాసు. కావ్యాలన్నింటిలోనికి నాటకానికి అత్యంతంగా ఆహ్లాదపరిచే గుణముంది. అలాగే లఘు గురువుల గణాలతో, యతి ప్రాసలతో విశిష్టమైన లయ కలిగిన 'పద్యం' తెలుగుభాష సొత్తు. మరి అలాంటి ప్రాశస్త్యం కలిగిన నాటకానికి లయబద్ధమైన పద్యరీతి తోడైతే బంగారానికి సువాసన అబ్బినట్టుంటుంది. ఆ దిశలోనే తిరుపతి వేంకట జంట కవులు రాసిన 'పాండవోద్యోగ విజయం' పౌరాణిక పద్య నాటకానికి బాగా జనాదరణ లభించింది. 'చెల్లియో చెల్లకో...', 'జెండాపై కపిరాజు...' లాంటి పద్యాలు ఆ రోజుల్లో అందరి నోళ్ళలో కూడా నలిగాయి.

అమెరికాలో ఉన్న తెలుగు వారికి కూచిపూడి, భరత నాట్యాలు నేర్చుకోవాలన్నా, అన్నమయ్య పదాల్లో, త్యాగరాజ కృతుల్లో శిక్షణ పొందాలన్నా వాటికి సంబంధించిన సంస్థలు, బోధించే గురువులు విరివిగా అందుబాటులో ఉన్నారు. కాని తెలుగు పద్య నాటకంలో శిక్షణ పొందాలనుకోవడం గగన కుసుమంతో సమానమే. ఇలాంటి పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ కు పదివేళ్ళ మైళ్ళ దూరంలోనున్న అమెరికాలో సిలికానాంధ్ర సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టింది.

'గాన గంధర్వ ' బిరుదాంకితుడైన గుమ్మడి గోపాలకృష్ణగారు తెలుగువారందరికి 'అభినవ కృష్ణుడు 'గా సుపరిచితులే. ఒకటిన్నర దశాబ్దలుగా తెలుగు పద్య నాటకానికి ప్రపంచ నలుమూల కీర్తిని ఇనుమడింప చేస్తున్న 'నంది అవార్డు ' గ్రహీత అయిన గుమ్మడిగారు ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్నారు. అలా అందివవచ్చిన ఈ సదవకాశాన్ని పుచ్చుకొని ఎప్పటికప్పుడూ సరిక్రొత్త ప్రయోగాలు చేసే సిలికానాంధ్ర వేసవి సెలవుల్లో అమెరికాలోని భావి తెలుగు తరానికి 'పద్యనాటక శిక్షణ శిబిరం' ప్రారంభించింది. ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడైన కూచిభొట్ల ఆనంద్ వినూత్నంగా ఒక కార్యక్రమానికి రూపకల్పన చేసారు.

రెండువారాలుగా సాగిన ఈ శిక్షణా శిబిరంలో నాలుగేళ్ళ ప్రాయం కలిగిన చిన్నారి నుండి పాతికమందికి పైగా పిల్లలు పాల్గొన్నారు. ప్రతిరోజు ఉదయం తొమ్మిది గంటలనుండి మొదలయ్యే ఈ కార్యక్రమంలో రోజుకో పద్యాన్ని రాగయుక్తంగా నేర్చుకొన్నారు. అమెరికాలో పుట్టి పెరిగిన పిల్లలు సంప్రదాయ తెలుగు దుస్తులు ధరించి ఉత్సాహం ఉరకలు వేస్తుంటే వివిధ పద్య నాటకాల్లోని పద్యాలను అత్యంత శ్రద్ధతో నేర్చుకున్నారు.

ఈ సమయంలో గుమ్మడి గోపాలకృష్ణగారు ఎంతో ఓర్పు వహించి పిల్లలకు శిక్షణ ఇచ్చారు. ప్రతి ఒక్కరిని పక్కన కూర్చోపెట్టుకొని శృతి ఎక్కడా తగ్గకుండా రాగంపై పట్టువీడకుండా పౌరాణిక పద్యాలు పాడే విధానంలోని మెళకువలని నేర్పారు. పిల్లలు కూడా ఆసక్తిని కనబరుస్తూ వినయంగా స్వచ్ఛమైన ఉచ్చారణతో తేనెలూరు తెలుగు పద్యాలను నేర్చుకొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేర్చుకొన్న పద్యాలివి.

"తెలుగుగదేలయన్న దేశంబు తెలుగు..." (శ్రీకృష్ణదేవరాయ విరచిత ఆముక్తమాల్యద, హిందోళరాగం), "సిరిగలవానికి చెల్లును తరుణుల పదియారువేలు..." (శ్రీనాథుడు, షణ్ముఖప్రియ), "ఇటులెంతైన ధనంబు వచ్చినను రానీ..." (బలిజేపల్లి లక్ష్మీకాంతం గారి సత్యహరిశ్చంద్ర, మోహనరాగం), "ప్రాయము వచ్చినంత, గృహభారము మూపున దాల్చి తండ్రికిన్..." (కాళ్ళకూటి నారయణరావు రచించిన చింతామణి, భీంపలాస్ రాగం), "ఎక్కడనుండి రాక ఇటకు, ఎల్లరున్ సుఖులే కదా...", "జెండాపై కపిరాజు, ముందు శ్రితవాని శ్రేణియున్ గూర్చి..." (తిరుపతి వేంకట కవుల పాండవోద్యోగ విజయం, కల్యాణ మోహన రాగాలు)

ఈ కార్యక్రమంలో ఆఖరి రోజున జరిగిన హైద్రాబాద్ దూరదర్శన్ సంచాలకులు, డా.పాలకుర్తి మధుసూదన్ రావుగారు ముఖ్య అతిధిగా విచ్చేసారు. విద్యార్ధులందరు ఒక్కొక్కరు రెండేసి చొప్పన వారు నేర్చుకొన్న పద్యాలను ఎంతో చక్కగా అలాపించారు. ఈ సందర్భంగా సిలికానాంధ్ర అధ్యక్షుడు శ్రీఫణి విస్సం రాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయం వెనకాల పిల్లల తల్లితండ్రుల సహకారం మరవలేనిది అన్నారు. గురువు గుమ్మడిగారు మాట్లాడుతూ పద్యం తెలుగుభాషకు ఆస్తిలాంటిది అన్నారు. తను సాధించిన ఈ ఫలితం చూస్తుంటే నంది అవార్డు పొందిన అనుభూతికంటే గొప్పగా ఉందన్నారు.

కూచిభొట్ల ఆనంద్ కార్యక్రమ విశేషాలను వివరిస్తూ రెండు వేల సంవత్సరాలున్న తెలుగు పద్యాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిది అని అన్నారు. ముఖ్య అతిధి మధుసూధనరావు గారు మాట్లాడుతూ సంగీత స్వరాలతో ముచ్చటగా స్వచ్ఛంగా పద్యాలను చదువుతున్న పిల్లలను చూస్తుంటే ఇంట్లో పండగ రోజులా ఉందన్నారు. సృజనాత్మక ప్రయోగాలు చేస్తున్న సిలికానాంధ్ర - దూరదర్శన్ అనుబంధం రెండేళ్ళ క్రితం మొదలైందని గుర్తు చేశారు. తెలుగు సంస్కృతి గొప్పతనాన్ని చాటుతున్న సిలికానాంధ్రకు దూరదర్శన్ సహాయ సహకారాలు ఎల్లప్పడు ఉంటాయని హామీ ఇచ్చారు.

నీహారిక, మానస, శ్రుతి, మహిత, ప్రియాంక, స్రుజన, కౌశిక్, మీన, ప్రణతి, స్ఫూర్తి, జాహ్నవి, అంజలి, కావ్య, సుహాసిని, అరుణ్, మైత్రి, అనూష మంగళంపల్లి, లలిత, మైథిలి, హరిమూర్తి, శాంతి, వల్లీరావు, అనూష కూచిభొట్ల శిక్షణ తీసుకొన్నారు.

## మంత్రముగ్ధులను చేసిన వేదమంత్ర సాహితీ ప్రకాశం

జూన్ 17, 2006న సన్నీవేల్, కాలిఫోర్నియాలో సిలికానాంధ్ర కార్యదర్శి తల్లాప్రగడ రావుగారు, వారి మిత్రబృందం "వేద మంత్ర సాహితీ ప్రకాశం" నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతి స్వామి వారు

తమ అమెరికా పర్యటనలో భాగంగా సిలికాన్ వేలీలోని సనాతన ధర్మకేంద్రం లో ఆయన శిష్యబృందం నిర్వహించిన చర్చాయుత ఉపన్యాసం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది.



పూర్వాశ్రమంలో డా.ప్రసాదరాయ కులపతిగా, అవధానిగా, సాహితీవేత్తగా వాసికెక్కి శ్రీస్వామివారు ఆసాంతం ప్రేక్షకులను అలరింపచేయడమేకాకుండా, మంత్రశాస్త్రంపై ఆశక్తినీ, వారి జిజ్ఞాసను పెంచి, మంత్ర, తంత్ర, యంత్ర సాధనల ఎడల ఒక మంచి అవగాహన ఇచ్చారు.




ఈ కార్యక్రమంలో డా. రొంపచెర్ల శ్రీనివాసాచార్యులు, ప్రఖ్యా మధుబాబు, తల్లాప్రగడ రామచంద్రరావు పృచ్ఛకులుగా వ్యవహరించారు. కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ డా. రొంపచెర్ల శ్రీనివాసాచార్యుల వారు మంత్రతంత్ర శాస్త్ర ప్రాశస్త్యాన్ని వివరించమని స్వామివారిని కోరారు. ప్రఖ్యా మధుబాబుగారు, భగవంతుని పరిమాణం ఎంత ఉంటుంది అని ప్రశ్నించారు. తల్లాప్రగడ రావు తన పద్యకుసుమాన్ని స్వామివారికి సమర్పించి, శృంగారనైషధంలో ప్రస్తావింపబడిన, చింతామణి మంత్రసాధన శవాలపైననే కూర్చునిచేయాలా అని అడిగారు. అలాగే, తల్లాప్రగడ శ్రీకాళహస్తి మహత్యంలోని సాక్షాత్తు పరమేశ్వర ప్రణీతమైన పద్యం మంత్రంలాకాకుండా, ఓ తప్పడు పద్యంలా ఎలావచ్చిందో చెప్పమన్నారు.

శ్రీ శ్రీ శ్రీ సిద్ధేశ్వరానందస్వామివారు ఈ ప్రశ్నలన్నింటికీ తన సుధీర్ఘమైన జవాబులతో, తగిన ఉపమానాలతో వివరించారు. ఆధ్యాత్మిక ఉపదేశాన్ని స్వామివారు సాగిస్తూంటే ఆసాంతం ప్రేక్షకులు తమనుతాముగా కట్టివేసుకుని, సామాన్యంగా దొరకని అనేక విషయాలని ఆకళింపు చేసుకొన్నారు.

## ఉర్రూతలూపిన 'వల్లారి బాబోయ్'

సిలికానాంధ్ర క్రియాశీలక సభ్యులైన సాయి, శ్రీనివాస్ మానాప్రగడల నాన్నగారు అయిన దివంగత మానాప్రగడ నరసిం హమూర్తిగారు 'జానపద బ్రహ్మ 'గా ఆంధ్రదేశమంతటా గుర్తింపుపొందారు. జానపద గీతాలతో మనసులను దోచుకున్న నరసిం హమూర్తిగారి ఎనిమిదవ సంస్మరణ సభ జూన్ 1న హైద్రాబాదులోని రవీంద్రభారతిలో ఘనంగా జరిగింది. 'వల్లారి బాబోయి ' పేరిట ఆప్కో, ఫార్మి సంస్థలు

సమ్యుకతంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో చంద్రతేజ బృందం, సూరి భగవంతరావు బృందం 'వల్లారి బాబోయ్...''మామానగులో...', 'ఏటికేతం పెట్టి...' మొదలగు ఎన్నో జానపద పాటలను చక్కగా పాడి ప్రేక్షకులని ఉర్రూతలూగించారు. చంద్రతేజ 'మానాప్రగడ నరసింహమూర్తి స్మారక అవార్డును అందుకొన్నారు. ఆసాంతం విశేషంగా జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు, పీ.వీ. రాజేశ్వరరావు, ప్రసారభారతి సీ.ఈ.ఓ. కే.యస్. శర్మ, ఆప్సో సంస్థ కార్యదర్శి కే.యస్.ఆర్. మూర్తి గారలు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని జానపద కళలను పరిరక్షించడం, జానపద కళాకారులను పోషించడం ఫార్మి మరియు ఆప్సో సంస్థల ముఖ్యోద్దేశ్యం.




